




పేజీలు. ముక్తసరిగా దాని సారాంశం ఇది: "వయస్సు అందమయినది. దానితో వచ్చే ఊహలు కూడా మనోహరమయినవి. అవి కొందరికి నచ్చకపోవచ్చు. కాని అవి రాక మానవు. అబ్బాయిల్నీ అమ్మాయిల్నీ కలవరపెట్టక మానవు. ఈ కలవరపాటును సత్యనారాయణలాంటి వాళ్లు అణిచిపెట్టి నిందొక్కుకొనగలిగి ఉండవచ్చు. కాని సుబ్బారావులాంటివాళ్లు నిభాయించుకుని నిలబడలేకపోతే అది వాళ్ల తప్పు కాదు.

కనక ఈ ఫైలులో సుబ్బారావు చేసింది ఏమయినా పొరపాటని ఎవరయినా అనుకుంటే ఆ తప్పు అతనిది కాదు.

తొందరపడి, చనువు గలవాళ్లు సుబ్బారావును నాలుగు తిట్టినా, తరవాత పశ్చాత్తాపపడక మానరు. కాస్త నిదానంగా ఆలోచించి చూస్తే ఇందులో అతని తప్పు ఏమాత్రమూ కనబడదు ఎవరికీ.

అసలు ఈ ఫైలు సుబ్బారావుకు సంబంధించింది కాదు. లలితది. అంతా చదివిన తరవాత, సత్యనారాయణ లాంటివాళ్లు మెదలకుండా ఊరుకోవడంకంటె కాస్త సానుభూతి చూపి, కావలసిన కార్యము, కావాలంటే

కళ్యాణము, పెద్దలచేత జరిపించటం మంచిది.

ఇక నాలుగవ పేజీకి తిప్పవచ్చును."

సత్యనారాయణ పేజీ తిరగవేశాడు. నాలుగవ పేజీ మొదలు పెట్టేడు. "యౌవనం కళ్ళు మూసుకున్న కలవమొగ్గలాంటిది. అది ఎప్పుడు రేకు తొడుగుతుందో చెప్పలేము. ఏ రేకు ఎప్పుడు విచ్చుకుంటుందో అసలే చెప్పలేము—అనిపించింది సుబ్బారావుకు. కారణం?

ఆ సాయంత్రం గాలి పీల్చుకుంటున్న సుబ్బారావు ఎదురింటి మేడపైన హఠాత్తుగా మెరుపులా కనబడి మాయమయిన చిన్నారిని చూశాడు. ఆ అమ్మాయిని ఇంకా కాస్సేపు చూద్దామనిపించింది.

మీనుల్లాంటి కళ్ళమధ్యనుంచి పాకి కిందికి దిగివచ్చిన సంపెంగపూవువంటి నాసిక ముద్దు పెట్టుకుంటూ ఉన్నట్టు భావించి, విల్లులా పైకి వంపు తిరిగిన పై పెదిమ, దానిని తీసిపారేసి అందంగా మిడిసిపడుతున్న కింది పెదిమ ఇంకా కాసేపు చూద్దామనుకున్నాడు.

కాని, ఆ హేమకుసుమసుందరిని ఆవాడు అంతా నిరీక్షించినా, తిరిగి కాంచలేకపోయాడు. కాని ఆ బంగారు తీగ పోతూ పోతూ, కనుచివరలనించి విసిరిన చూపు అతని గుండెలలో నాటుకు పోయింది. ప్రథమ వీక్షణం లోనే అతని గుండె ఎగిరిపోయింది!

అతని యౌవనం, ఒక రేకు తొడిగింది మనస్సనే పూవుకు. మరునాడు సుబ్బారావు గాలి పీల్చుకోటానికి వెళ్ళేప్పటికి ఆ అమ్మాయి మేడమీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్నది.

తీయని మిఠాయి తిన్నట్టూ, వెన్నెలలో స్నానం చేసినట్టూ ఆనందపడ్డాడు సుబ్బారావు. ఒక అందమయిన గేయనాటిక వ్రాద్దామని ఉత్సాహం కలిగింది. కాగితం కలం తీసుకుని వ్రాయటం మొదలెట్టాడు.

గేయ నాటిక మధ్యలో ఆగిపోయింది. మనస్సు ఆ అమ్మాయివైపు తిరిగి ఉత్సాహం ఆవిరయిపోయింది. దొంగ చూపులు చూస్తున్న సుబ్బారావు, మధ్య మధ్య ఆ అమ్మాయి కూడా తనవంక చూడటం చూసి పన్నీరు చల్లినంత ఆనందం అనుభవించాడు.

కొన్ని రోజులు ఇల్లా గడిచిపోయేయి.

**ఆఅమ్మాయి** విసిరిన చూపుల తూపులకు **సుబ్బారావు మనస్సుకు** తొడిగిన రేకు **బలపడి రంగుపులుము కుంది. మొకాడుతున్న హృదయాన్ని దిటవు పరుచుకొని** ధైర్యంగా ఒక అడుగు ముందుకువేశాడు. ప్రేమజీవులకు అన్నీ విషమ పరీక్షలే గదా! అసలు ప్రేమాయణంలోనే అడుగడుగునా ఆశ్చర్యాలాయె.

ఒకనాడు ఆఅమ్మాయి చూస్తూ ఉండగా, అతను వణుకుతున్న చేతులతో ఒక చీటీ వ్రాసి, చిన్న రాతికి చుట్టి ఆ మేడమీదికి విసిరేశాడు. కాస్సేపటికి ఆ అమ్మాయి లేచివెళ్ళి ఆచీటి విప్పి చదువుకోవటం గమనించి అతను సిగ్గుపడ్డాడు.

'అందమయిన అమ్మాయీ! మీ పేరు నాకు తెలియదు. లలిత మనోజ్ఞమయిన మీఅందం "లలిత" అని మిమ్మల్ని పిలవమంటున్నది.

మీతో స్నేహం చెయ్యాలని నా మనస్సు కోరుతున్నది. అయితే ఇందుకు మీరు ఒప్పుకోవాలిగదా! ఇన్నాళ్ళనుంచీ చూపులతో మనం పరిచితులమే. అయితే అందం అంటే ఏమిటో ఇదమిత్థంగా చెప్పగలవారు లేరు. కాని అందాన్ని కోరుకొని, స్వంతం చేసుకొని, ఆనందించాలని తాపత్రయ పడని వారు ఉండరు. ఆశించినది లభ్యం కాకపోతే సరిపెట్టుకోగల శక్తి మాత్రమే చాలా అరుదుగా ఉంటుంది.

**మీనుంచి ఈ ఉత్తరానికి సమాధానం కావాలని నే ఆశించటం అత్యాశకాదనలేను.**

కానయితే **నా స్నేహాన్ని మీరు ఆమోదించేపక్షంలో దాన్ని మీరు ఒక విధంగా సూచించవచ్చును. రేపు మీరు జడలో ఒకే ఒక్క గులాబీని తురుముకొని నాకు కనబడితే మన స్నేహాన్ని మీరు ఆమోదించినట్టు భావిస్తాను.**

మన స్నేహం శరజ్జ్యోత్స్నలాగు ఆనందప్రదం కావాలని ఆశిస్తున్నాను.

ఇట్లు

..........'

ఆ ఉత్తరం చదువుకున్న ఆఅమ్మాయి మొహం ఎర్రబడింది. చేతిలో ఉత్తరాన్ని నలిపి ఉండగా పట్టుకొని లోనికి పరుగెత్తింది. అది చూసిన సుబ్బారావుకు అనుమానం వచ్చి గుండెల్లో రైళ్ళు తిరిగేయి. గదికి తాళం వేసి కంగారుగా బజారున పడ్డాడు సుబ్బారావు. ఎవరో తనను వెంటాడుతున్నట్టు ఊరంతా తిరిగి రాత్రి ఎనిమిదింటికి గది చేరాడు. సుబ్బారావుమీద ఏమాత్రము అనుమానం ఉన్నా, ఆవిషయం పసికట్టటం సత్యనారాయణకు పెద్ద కష్టమయ్యేదికాదు. అసలు అనుమానమనేది లేకపోవటంవల్ల ఇసంగతి అతను గమనించలేదు. ఆరాత్రల్లా ఎవరయినా వచ్చి బెదిరిస్తారేమోనని కంగారు పడ్డాడు సుబ్బారావు. కలత నిద్రతో రాత్రి గడిచి పోయింది ఎలాటి బెడదా లేకుండానే.

మరునాటి సాయంత్రం జడలో ఒకే గులాబీని తురుముకుని వస్తూ కనబడింది ఆ అమ్మాయి. సుబ్బారావు బ్రహ్మానందభరితుడే అయ్యేడు. ఆనాటినుంచీ నవ్వులపువ్వులతో అభిషేకం చేసుకునేవారు ఇద్దరూ ఒకరి నొకరు. తొలిప్రేమకు ఇటువంటి ముగింపు దొరకడం అబ్బురమే గదా! అవసరమనిపించినప్పుడు రాళ్లతో ఉత్తరాలు పంపిస్తూ ఉండేవాడు సుబ్బారావు. అవన్నీ అందుకునేది ఆ అమ్మాయి, జవాబులు వ్రాయక పోయినా.

ఇలా కొన్ని రోజులయినాక, బలపడి రంగు పులుము కున్న రేక విచ్చుకున్నది. విరహము ఎల్లెడలా వ్యాపించి రాజ్యం చెయ్యటం మొదలెట్టింది. 'ఈ బాధ దుర్భరము. ఎడబాటు సైపలేను' అని బాధపడ్డాడు సుబ్బారావు. **అతని బాధ గ్రహించినట్టుగా ఆమె జాలిగా చూసేది అతనివైపు.**

**సుబ్బారావుకు అబద్ధం ఆడటంకంటె, మాట్లాడ** కుండా ఊరుకోవటం ఇష్టమని అతన్ని ఎరిగున్న వాళ్ళందరికీ తెలుసును. కనక చిన్నదీ చిన్నవాడూ ఒకరినొకరు చూసి ఇష్టపడినట్లు సునిదితమే గదా! సత్యనారాయణ కూడా ఒప్పుకోక తప్పదు!

కనక, సత్యనారాయణా! ఈ ఫైలును చూసినట్టు సంతకం పెట్టి ఇక నువ్వు రెండవఫైలును చూస్తానంటే అందుకు అభ్యంతరం ఏమాత్రమూ లేదు."

## పాలడుగు వెంకటేశ్వరరావు

సత్యనారాయణ రెండవ ఫైలు తీశాడు. దాని అట్ట చిరిగిపోయి ఉన్నది. అందులో ఉన్నవి చాలా తక్కువ పేజీలు. సత్యనారాయణ చదివాడు. దాని సంగ్రహ సారాంశం ఇది :

"సుబ్బారావు అంతటితో ఊరుకొనలేదు. ఎట్టి కార్యమయినా నెరవేరవలెనంటే కృషి అవసరం కదా! చాలా రోజులు శ్రమపడి సుబ్బారావు ఈ కింది విలువయిన సమాచారం సేకరించాడు. అదే ఈ రెండవ ఫైలులోని విషయం.

ఆ అమ్మాయికి తండ్రి మాత్రమే కలడు. తల్లి చిన్నతనములోనే పోయింది. అందరికంటె చిన్నది ఈ చిన్నారి. ఇంకా వివాహం కాలేదు. మంచి స్థితిపరులే. మిగతా అందరికి వివాహమయి ఎవరికివారు విడివడి పోయారు.

మదరాసులో ఈ బాలిక స్కూలుఫైనలు వరకు మాత్రమే చదివి అంతటితో ఆపివేసిందట!

ఈ ఫైలులో అన్నిటికంటె ముఖ్యంగా గమనించ వలసింది ఈ కింది పేరాగ్రాపు.

ఆమె తండ్రి రాజగోపాలంగారు మంచి మర్యాదగల వంశంనుంచి వచ్చినవాడు. సాంప్రదాయికమయిన కుటుంబం వారిది. తదితర వివరాలన్నీ 'రికార్డు' చేసి ఈ విషయం ఏకాగ్రతతో సుబ్బారావు పరిశీలించాడు. అందుమీదట అతడు ఈ నిర్ణయానికి వచ్చాడు: సుబ్బారావు ఈ అమ్మాయిని చేసుకుని ఒక ఇంటివాడవటానికి అతని తల్లిదండ్రులకు ఉండగల ఎలాటి అభ్యంతరమూ కాగడా పెట్టి వెదికినా అతనికి కనిపించటంలేదు. ఇదే విషయం ఎవరికయినా అన్వయించవచ్చును."

రెండవ ఫైలూ అయిపోయింది! మిగతా చెత్తంతా తీస్తే సారాంశం ఇదన్నమాట. ఆఖరికి ఆఫీసునోటుగా ఇలా ఉంది.

"ఒరేయ్! సత్యనారాయణా! నువ్వు అప్పుడప్పుడు ఇంటికి తెచ్చే ఆఫీసు ఫైళ్ళు చూసి ఆఫీసులో ఫైళ్ళు ఎలా నడిచేదీ కొంచెం ఆకళింపు చేసుకున్నాను. ఆ విజ్ఞానం ఉపయోగించే ఈ కేసు ఈ రెండు ఫైళ్ల రూపంలోనూ నీముందు ఉంచాను.

ఈ కేసు ఇంతవరకూ చదివాక ఏం చెయ్యాలో చెప్పమని నీలాటివాడు అడగటం అంత సమంజసం కాదనుకుంటాను. అయినాసరే, ఇది స్వవిషయంగనక, అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెబుతున్నాను నువ్వు చెయ్యవలసిన పనిని గురించి.

విశ్వనాథంగారి దగ్గర నీకు ఉన్న పరపతికీ, సుబ్బారావుకు ఉన్న పరపతికీ ఎంతో తేడా ఉన్నది. పైగా అది అతని స్వవిషయం. ఎలా వివరించగలను? పైగా ఈ కేసులో అంతా స్పష్టంగా ఉన్నది గనక నువ్వు చెయ్య వలసిన పని చాలా సులభసాధ్యమయినది. నీ బుద్ధి ఉపయోగించి, ఏదో విధంగా విశ్వనాథంగారూ, రాజగోపాలం

## ఇంగ్లీష్ టెరిలిన్



పాంట్, షర్టు ముక్కలు (1.25 & 2.15 మీటరు) రెండు ముక్కలు క్లియరన్సు అమ్మకపు ధర రు. 25/-లు. రెండుసెట్లు (2.50 & 4.30 మీటరు) రు. 48/-లు., సూటు విడివి ఇంగ్లీష్ టెరిలిన్ (త్రీపీసుల్సు) రు. 40/- వి.పి.పి. చార్జీలు.రు. 2-50.

**ARVIND AGENCIES (WAPB-25),**
**Box 1408. Delhi-6,**



## ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులు కండి. స్త్రీ, పురుషులకు వర్తకు అనువైనది. దీనివంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి లేదు. వివరములు ఉచితం.

**TOTAL HEALTH**
**Azad Market (A.P.V.)**
**Delhi-6.**






కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14

సీతారామ జనరల్ షాప్సు (ఏజెన్సీస్)


# హత్య

గారూ ఒక రోజు వచ్చి, ఆ ఇద్దరు ప్రేమికుల వివాహమూ అయిందీ అనిపించేటట్లు చెయ్యటమే తరవాయి!

మామయ్య నీకు బాగా తెలుసును. అతని పలుకుబడి నీకు తెలుసు.

కనక, నువ్వే 'కేసు వర్కరు' వనుకుని, నీ నేర్పు ఉపయోగించి దీనికి నివేదిక తయారుచెయ్యి. నేర్పుగా ఈ కేసు గెలిపిస్తే నీ నోట్లో పంచదార!"

బుగ్గమీద చెయ్యి పెట్టుకుని ఆలోచిస్తున్న సత్యనారాయణ "ఏరోయ్! అయిందా?" అన్న ప్రశ్న విని పక్కకు తిరిగి చూశాడు.

నిద్రనుంచి లేచి ఎంత సేపటినించి చూస్తున్నాడో, సుబ్బారావు ఎర్రబడిన కళ్ళతోనుంచి నవ్వుతున్నాడు. సత్యనారాయణకు జాలి వేసింది.

త్వరగా ఆ ఫైళ్ళమీద ఏదో వ్రాసి సంతకం పెట్టాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ మరునాటి రాత్రి సత్యనారాయణను బెజవాడపోయే రైలెక్కించి సుబ్బారావు ఆనంద స్పందిత హృదయుడై తిరిగి వచ్చాడు. ఆ మరునాడే ఆ విషయం రాత ఉత్తరం ద్వారా ఎదురింటి మేడ మీదికి చేరిపోయింది.

పది రోజులు అయిన తరవాత, సుబ్బారావు మామయ్య చలపతిగారితోనూ, విశ్వనాథంగారితోనూ మాట్లాడి వెళ్ళిన పనిని ఒక దారికి పెట్టి బ్రహ్మాండమయిన స్వాగతం లభిస్తుందేమోనని ఆశిస్తూ గది ముందు రిక్షా దిగిన సత్యనారాయణ ఆశించిందేమీ అవకపోయేసరికి కాస్త తడబడిన మాట నిజమే.

తలుపు తెరుచుకుని గదిలోనికి సత్యనారాయణ వచ్చేసరికి సుబ్బారావు చాపమీద వెల్లకిలా పడుకుని పైకి చూస్తున్నాడు నిర్లిప్తంగా. ఈ హఠాత్పరిణామానికి కొంచెం భయపడినా, గట్టివాడు గనక నిభాయించుకుని తను నిర్వర్తించుకొని వచ్చిన కార్యాన్ని గురించి క్లుప్తంగా వివరించి, సుబ్బారావును ఇటువంటి పరిస్థితిలో ఉండటానికి గల కారణ మేమిటని అడిగాడు. అతనికి అందజెయ్యబడిన సమాచారం ఇది:

ఆనాడు సత్యనారాయణను రైలెక్కించి వచ్చిన సుబ్బారావు బాగానే ఉన్నాడు. ఆ మరునాడు తన ప్రేయసికి ఉత్తరమూ పంపించాడు. అంతే! ఆదే ఆఖరుసారి తను ఆమెను చూడటం.

ఆ తరవాత నాలుగు రోజులు వరసగా ఆమెకోసం ఆశతో నిరీక్షించాడు. కాని ఆ అమ్మాయి జాడ తెలియలేదు. కాలు కాలిన పిల్లిలా ఊరంతా తెగ తిరిగాడు కాని ఆ ఇంటి లోపలికి వెళ్ళి విచారించే సాహసం చేయలేకపోయాడు.

ఆ నాలుగు రోజులు అతనికి తిండి సయించ లేదు. రాత్రులు నిద్రలేకుండా గడిపాడు. ఆ ఇంటికి ఎవరో కొత్త కొత్తవాళ్ళు రావటం అతను గమనించాడు. ఎన్నడూ ఇదివరకు కనిపించనివాళ్ళు చాలామంది ఆ ఇంట్లో తిరుగుతూ ఉన్నారు. అయితే ఆమె మాత్రం కనిపించలేదు.

వారం రోజుల తరవాత ఒకనాటి మధ్యాహ్నము, సుబ్బారావు ఏదో చదువుకుంటూ ఉండగా, దగ్గరగా వేసి ఉన్న తలుపు తోసి ఒక అపరిచిత వ్యక్తి లోపల ప్రవేశించాడు, "క్షమించాలి నన్ను" అంటూ. సుబ్బారావు ఆయన్ను ఆహ్వానించి కూర్చుండబెట్టాడు. పరస్పర పరిచయాలయినాక వారిద్దరూ ఇలా మాట్లాడుకున్నారు. పావారణ ఏమీ లేదు. ఆయన పేరు ఆంజనేయులు. సన్నగా పొడుగ్గా ఉన్న ఆకారం. లావుపాటి మీసాలు, కళ్ళజోడు బయటికి పొడుచుకొని వచ్చే పళ్ళు ఆయన ముఖం మీద బుగ్గలూను. ముఖ్యమైన వెంట్రుకలు ఎప్పుడో వదలి మొహంమీదికి వంగి చూస్తూ ఉన్నాడు.

"సుబ్బారావుగారూ! మీరు నన్ను ఎరుగున్నవాణ్ణి కాను. మా పెదనాన్న చలపతిగారు, గోపాలంగారు నాకు మేనమామ అవుతారు. మీకొకటి వినిపించి నేనూ లలితా భార్యాభర్తలం అని ఎవరూ ఏదీ పించేవారు. నేను లలితను ప్రేమించాను. కాని నన్ను చూసి ఏ స్త్రీ కూడా మనస్ఫూర్తిగా ప్రేమిస్తుందని అనుకోవటానికి నాకు సాహసం చాలదు.

"అయితే ఒకటి మాత్రం నిజం. లలితంటే నాకు చాలా ఇష్టం. ఆ అమ్మాయి ఇంకొకరి భార్య అయితే నేను ఎంతో బాధపడటం మాత్రం ఖాయం. అయితే ఆమె మా మామయ్యకి గారాల బాలిక. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఆయన ఏ పని చెయ్యడు...."

సుబ్బారావు మొహం చిట్లించాడు. ఆంజనేయులు నవ్వి అన్నాడు: "మీరు చికాకు పడతారని నాకు తెలుసు. అయితే మీతో ఒక ముఖ్యమయిన పని ఉండి వచ్చాను. వారం రోజుల క్రితం లలితకి మశూచి వచ్చింది. ఒళ్ళంతా భయంకరమయిన మచ్చలు. మనిషి రూపు మారి పోయింది. నేనూ, మా అమ్మా దగ్గిర ఉండి అన్నీ చూశాము. పాపం, మామయ్య వాళ్ళ ఇబ్బంది పడిపోయారు.

"డాక్టరు వ్యాధిని పోగొట్ట గలిగాడు గాని మచ్చలు తీసివెయ్యలేకపోయేడు. లలిత ఇప్పుడు కోలుకుని బాగానే ఉంది. కాని మానసికంగా చాలా బాధ పడుతున్నది.

"ఇన్నాళ్ళనుంచీ లలిత పెళ్ళిని గురించి ఏమీ పట్టించుకోని మామయ్య, నా పెళ్ళిని గురించి మా అమ్మ ఎప్పుడయినా కదలేసినప్పుడు, 'అప్పుడే ఏం తొందర?' అని నవ్విన మామయ్య, ఇప్పుడు లలిత పెళ్ళిని గురించి బెంగపెట్టుకున్నాడు. లలిత తన పెళ్ళిని గురించిన వాళ్ళ మాటలు విన్నది కామోసు! పొద్దున నాతో మీ విషయం వివరంగా చెప్పింది. మిగతా విషయాలెలా ఉన్నా మేమిద్దరం దాపరికం లేని మనుష్యులం. అన్నీ చెప్పి ఈ ఉత్తరం మీకిచ్చి రమ్మని ఆమె నన్ను కోరింది. అంతా విన్న తరవాత నన్ను వివాహం చేసుకోవలసినదని లలితని అడగడానికి నేను పూనుకోలేదు. మీమీద ఆమెకు అచంచలమయిన విశ్వాసం ఉన్నట్లు నాకు అర్థమయింది. ఇంకా చెయ్యి జారిపోకముందే, అంతా చక్కబడితే బావుంటుందని ఆమె అనుకున్నది. అయితే మీ దగ్గర ఆమె ఏదీ దాచదలచుకోలేదు. ఉన్న విషయాన్ని విపులంగా వివరించి మీకు ఈ ఉత్తరం అందజేయమని ఆమె నన్ను కోరింది. ఆమెమీద నాకు జాలి వేసింది. అందువల్ల ఆమె కోరికను నేను నిరాకరించలేకపోయాను" అంటూ అతను ఒక ఉత్తరం

ఇచ్చాడు. ఉత్తరం క్లుప్తంగా ఉన్నది.

"ప్రియబంధూ! మా బావ ఆంజనేయులు మీకు అన్నీ తెలియ జేస్తాడు. మీరు అతనివెంట వచ్చి, నాన్నగారితో మన విషయం తెలియ చెయ్యండి. ఆంజనేయుల్ని నేను ఎప్పుడూ వివాహం చేసుకోవాలని అనుకొని ఉండలేదు. నా ఆశలన్నీ మీరే. వస్తారుగా... ఇట్లు......."

ఆ ఉత్తరం చదువుతున్న సుబ్బారావుకు తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. ఆంజనేయులు చెప్పిన విషయాలు నమ్మలేకపోతున్నాడు. నమ్మకుండా ఉండలేకపోయాడు.

లలిత సుందర స్వరూపం, మనోహర లావణ్యం అతనికి గుర్తుకు వచ్చాయి. మరుక్షణం మళ్ళీ మచ్చలలో ఉన్న లలిత మొహం ఊహించుకున్న అతనికి అమితంగా బాధ కలిగింది. అటువంటి సంఘటనను గురించి ఆలోచించటానికి భయం వేసింది అతనికి.

తను హృదయపూర్వకంగా ప్రేమించిన బాలికకు అట్లా కావడం అతనికి విరక్తి కలిగించింది. ఇదంతా నిజమా, కలా అన్న ఆలోచనా కలిగింది. తల తిరిగి పోయినట్లుగా, ఆ ఉత్తరాన్ని చేతితో పట్టుకుని కూర్చుని అయోమయంగా చూస్తున్న సుబ్బారావును చూస్తూ అలాగే ఉండిపోయాడు ఆంజనేయులు కాస్సేపు.

"అన్నట్టు మీకు చెప్పడం మరిచిపోయాను రేపు తెల్లవారుఝామున మద్రాసు వెళ్ళిపోవడానికి నిశ్చయం చేశారు అమ్మా, మామయ్యా. మీరు ఇప్పటికీ లలితని కోరుకుంటున్న పక్షంలో ఇప్పుడు నాతో వచ్చేసి మామయ్యతో చెప్పెయ్యండి. పోనీ, మీరు ఊరికే వచ్చి కూర్చుంటే నేనే మిగతా వ్యవహారం చూస్తాను.

ఇందులో నా స్వార్థం ఏమీలేదు. పాపం లలితకి అసలే పెద్ద దెబ్బ తగిలింది. ఈ సమయంలో ఆమెపై చేతనయినంతవరకు జాలి చూపించి సహాయ పడటమే నా ఉద్దేశ్యం. ఈ వార్త మీకూ పిడుగు లాగ తగిలి ఉండవచ్చును. కానీ, వాస్తవం ఇది. మీరు కాసేపు ఆలోచించుకోండి. అట్లా వెళ్ళి వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

అస్తవ్యస్తమయిన ఆలోచనలతో సుబ్బారావు తల వేడెక్కిపోయింది. కాస్సేపయింతరవాత ఆంజనేయులు వచ్చాడు. "సుబ్బారావు గారూ! వస్తున్నారా?" అని అడిగాడు.

కాసేపు చూసి సమాధానం రాకపోవడంతో, "పోనీ, లలితకి ఏమయినా ఉత్తరం రాసి ఇస్తారా?" అని అడిగాడు. దానికీ జవాబివ్వక అలాగే చూస్తూ ఉండి పోయాడు సుబ్బారావు. కాస్సేపు ఆగి విసుగెత్తి, వెళ్ళిపోయాడు ఆంజనేయులు చివరికి.

ఆంజనేయులు వెళ్ళిపోయేక కూడా చాలాసేపు అలా ఆలోచిస్తూనే ఉండి పోయేడు సుబ్బారావు. ఆ రాత్రి అతనికి తిండి లేదు. అల్లాగే చూస్తూ ఏ మూడు గంటలకో నిద్రపోయేడు.

ఆ మరునాడు ఆ ఇంట్లో సందడి లేదు. బావురు మంటున్నట్టు కనబడింది ఇల్లు. ఆ తెల్లవారు ఝామునే అంతా కలిసి మదరాసు వెళ్ళిపోయేరని తెలిసింది తరవాత.

తను ఏమి చేసేడు? ఏమి కావాలని కోరుకున్నాడు? ఏమయింది?—ఇవే అతని ఆలోచనలు. 'లలిత తనను గురించి ఏమనుకుంటుంది! పాపం వెళ్ళిపోయేటప్పుడు ఎంత బాధ పడిందో గదా? అంత అందమయిన అమ్మాయి ఆ విధంగా అయిపోవటం తనకే ఇంక రంపపు కోతగా ఉందిగదా! ఇక ఆ అమ్మాయి ఎట్టి బాధకు లోనయిందో గదా!

'ఇట్లాంటి స్థితిలో ఎవరయినా కావాలనుకున్నవారి దగ్గిర మంచి సానుభూతిని సహాయాన్ని అపేక్షించటంలో అసహజత్వం ఏమీ లేదు. అయితే మూర్ఖతవల్ల తను ఏమీ చూపలేక పోయేడు. తను ఎందుకూ పనికి రాడు.

'ఇన్నాళ్లనుంచి ఆ అమ్మాయిలో కొత్త ఆశల్ని ప్రేరేపి, కలల్లో విహరింప జేసినవి తను చేసిన పనులు. ఆమె కట్టుకున్న ఆశల నిచ్చెనలు విధి క్రూర దృష్టిలో పడినవి. తను ఆ నిచ్చెనలను విరిచి పారేసి ఏమీ ఎరగనట్టు ఉండిపోయేడు. తను చేసిన ద్రోహానికి ఆమె ఎన్ని విధాల శపించిందో?' అంటూ బాధపడ్డాడు సుబ్బారావు. అంతావిని సత్యనారాయణ సుబ్బారావును ఓదార్చేడు.

మరో రెండు నెలలకు గాని మళ్లీ సుబ్బారావు మామూలు ప్రపంచంలో పడలేదు. అయినా ఆ విషయం అంత త్వరగా మరిచిపోలేదు. ఆ యేడు అతను పరీక్ష తప్పేడు.

● ● ●

బందరునుంచి బెజవాడ వెళ్ళే రైలు గుడివాడ స్టేషనులో ఆగింది. ఒక థర్డ్‌క్లాసు కంపార్టుమెంటులో మూలను సామానుల మధ్య కూర్చుని పుస్తకం చదువు కుంటూన్న సుబ్బారావు, "ఏమండోయి! నాలుగోవాడు ఇందాకటినుంచి ఏడుస్తున్నాడు. ఏమయినా పట్టుకు రండి" అన్న శ్రీమతి పురమాయింపును శిరసావహించిన వాడై ప్లాటుఫారంమీదికి వచ్చాడు.

ఈ పదేళ్లలోనూ సుబ్బారావులో చాలా మార్పు కనబడుతూంది. మనిషి పలచబడ్డాడు. బుగ్గలు లోపలికి తోసుకుని పోయేయి. తలమీద వెంట్రుకలు పచ్చబడ్డాయి.

ఫలహారశాల వద్ద పిల్లలకు పళ్లూ, బిస్కట్లూ తీసుకుంటూన్న సుబ్బారావుకు దూరంగా వెయిటింగు రూము ముందు బెంచీమీద కూర్చున్న స్త్రీని ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఆమె ఎటో చూస్తున్నది.

మళ్లీ మళ్లీ చూశాడు ఆమె వైపు. మనస్సు ఏదో బాధతో మూలిగింది. అంతరాంతరాలలో ఏవో జ్ఞాపకాల తెరలు లీలగా కదిలాయి. కాని ఆ పొరలు అతను ఎంత ప్రయత్నించినా విడివడలేదు. విసుగువచ్చి ఆ ప్రయత్నం మాని నడిచాడు ఇవతలికి.

బరువుగా చెయ్యి తన భుజంమీద పడేసరికి పక్కకు తిరిగి చూసిన సుబ్బారావుకు, నవ్వుతూ "నేను గుర్తున్నానాండి?" అని పలకరిస్తూన్న ఆంజనేయులు కనిపించాడు. ఇంకో పదేళ్ల తరవాతయినా అతన్ని తను గుర్తు పట్టగలడు. అతని అవతారం అట్టిది. "భీమవరంలో మా మేనల్లుడి పెళ్లి. మా వాళ్ళతో కలిసి వెడుతున్నాను"అని చెప్పేడు. తన ఆరోగ్యం,ఉద్యోగం అభివృద్ధి మొదలయిన విషయాల్ని గురించి కబుర్లు చెప్పేడు ఆంజనేయులు వసపోసినట్టు.

ఇప్పుడు తెలిసింది సుబ్బారావుకు ఇందాక ఫలహారశాల వద్ద చూసి తను జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నించిన స్త్రీ ఎవరో.

సుబ్బారావులో పాత జ్ఞాపకాలు మెదిలేయి. ఆంజనేయులికి చెవులు అప్పజెప్పి ఆ జ్ఞాపకాలనే నెమరువేస్తూ నిలుచున్నాడు. అతనిలో అనేక ప్రశ్నలు బయలు దేరేయి. ఎన్నో ప్రశ్నలు అడగాలనిపించింది. నోరువిప్పి ఒక్క ప్రశ్నా అడగలేక పోయేడు. ఇప్పుడూ అతని చేతగానితనమే అతనికి అడ్డు వచ్చింది.

గార్డు విజిలు వేశాడు. పచ్చజండా ఎగురుతూంది. తను వెళ్లిపోవాలి.

ఇక ఆగలేకపోయేడు సుబ్బారావు. "లలిత ఎట్లా ఉంది?" అని అడగలేక అడగలేక అడిగేడు ఆంజనేయులిని.

ఆంజనేయులు పకపకా నవ్వేడు. "ఎవరూ? మీ లలిత సంగతేనా? పాపం! ఇంకెక్కడి లలితండీ! ఆ లలిత చచ్చిపోయింది అప్పుడే, పాపం పోతూపోతూ మిమ్మల్ని గురించి పలవరిస్తూ. ఇంకా ఎందుకులెండి ఆ సంగతులు?

అన్నట్టు, మావాళ్లని చూడలేదు గదూ మీరు. అదుగో వస్తున్నది, మీరు చూద్దురుగాని. వెయిటింగు రూమువద్ద కూర్చుని కూర్చుని విసుగు వచ్చింది కాబోలు ఆవిడగారికి..." చెప్పుకుపోతున్నాడు ఆంజనేయులు.

> ముందుగా కనుపించినంత మంచిగా ఏదీ ఉండదు.
>
> —జార్జి ఎలియట్

కళ్లవెంట నీరు జలజలా కారుతూండగా, మొహం పక్కకు తిప్పి కళ్లు తుడుచుకున్నాడు సుబ్బారావు.

రైలు బయలుదేరబోతున్నట్టు కూతవేసింది. కాసేపటికి నోరుపెగుల్చుకుని,"అవును,ఆంజనేయులుగారూ! నా లలితని నేనే చేతులారా చంపివేసేను. నేనే ఆమె అందమైన ఆశలను క్రూరంగా హింసించి హత్యచేసేను. అయితే నేను కావాలనిమాత్రం అలా చెయ్యలేదు. నా మాట నమ్మండి.

నా లలిత చావలేదు. హత్య చెయ్యబడింది. అందుకు గాను నాకు మీరు ఇప్పుడు విధిస్తున్న శిక్ష ఎంత మాత్రము సరిపోదు. నిజంగా, నా లలిత ఇక లేదు" అన్నాడు సుబ్బారావు.

రైలు కదిలింది. ఆంజనేయులుతో ప్రస్తావనయినా చెప్పకుండా, కన్నీరు తుడుచుకుంటూ పరుగెత్తుకొని వెళ్లి పెట్టె ఎక్కిన సుబ్బారావు, అప్పుడే అక్కడికి వచ్చిన ఆ మనిషి తనను వెనకాల నించి దయతోనూ, ఆర్ద్రతతోనూ చూడటం గమనించలేదు.

కాస్సేపయినతరవాత, బుగ్గన వేలుపెట్టుకొని ఎర్రబడిన కళ్లతో ఆలోచిస్తూ కూర్చున్న సుబ్బారావును, "ఏమండోయి, బుజ్జి చూడండి, మిమ్మల్ని చూసి చేతులెట్లా చాచుతూందో?" అన్న మాటలతో ఈ ప్రపంచంలోనికి లాగుకొని వచ్చింది ధర్మపత్ని. ★